ప్రజాశక్తి
ఆదివారం 11 ఫిబ్రవరి 2024
5
అనంతపురం

రోడ్డుపై పత్తిని పడేసి నిరసన తెలుపుతున్న పత్తి రైతులు

పత్తి రైతుల నిరసన

◆ రోడ్డుపై పంట పారేసి ఆందోళన

◆ క్వింటాకు రూ.2000 బోనస్ ప్రకటించాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పత్తికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ పత్తి రైతులు నిరసనకు దిగారు. శనివారం ఉదయం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు పైన పత్తిని పడేసి నిరసన తెలిపారు. మద్దతు ధర రూ.7020కి అదనంగా క్వింటాల్‌కు రూ.2 వేలు బోనస్ ప్రకటించి రూ.9020తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా పత్తి సాగు విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. గత ఖరీఫ్‌లో సుమారు 80 వేల ఎకరాల్లో పత్తి సాగు అయ్యిందన్నారు. రెండు సంవత్సరాల ముందు పత్తి ధర బాగా ఉండటంతో ఈ సారి కూడా ఈ పంట సాగుపై రైతులు దృష్టి సారించారన్నారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధరలు పతనం అయ్యాయన్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇళ్లలోనే పత్తిని వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అప్పులు చేసి పంటను సాగు చేసిన రైతులు వాటిని తీర్చేందుకు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇదే సమయంలో దళారులు సిండికేట్ అయ్యి క్వింటా రూ.5 నుంచి రూ.6వేల మధ్యలోనే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు పడిపోవడంతో గత రెండు సంవత్సరాలుగా సాగు అయిన పత్తి పంటను రైతులు ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారన్నారు. ఎప్పుడు ధర వస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మద్దతు ధరతో పంటను కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాటలు ఆచరణలో కన్పించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్వింటా పత్తిని రూ.9020కి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పత్తి రైతులు నాగరాజు, నాగేశ్వర, వెంకట్రామిరెడ్డి, ముని, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం అందించడంలో ఇద్దరి పాత్ర ఒక్కటే..

◆ వృత్తిలో నైతిక విలువలు పాటించాలి

◆ యువ న్యాయవాదులకు సుప్రీంకోర్టు జడ్జీల ఉద్బోధ

న్యాయవాదుల శిక్షణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు జడ్జీలు అశానుద్దీన్ అమానుల్లా, ప్రశాంత్‌కుమార్‌మిశ్రా, ఎస్‌విఎన్‌బట్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కక్షిదారుడికి (క్లైయింట్) న్యాయమందించడంలో న్యాయమూర్తి, న్యాయవాది ఇద్దరి పాత్ర ఒక్కటేనని సుప్రీం కోర్టు జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా తెలియజేశారు. అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో యువ న్యాయవాదుల శిక్షణ తరగతులు శనివారం నాడు జరిగాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో న్యాయకోవిధులు, యువ న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మూడు సెషన్లుగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ముగ్గురు ప్రధాన వక్తలుగా హాజరవగా, రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, న్యాయవాదులు పెద్దఎత్తున పాల్గొన్నారు. 'ఇంపార్టెన్సు ఆఫ్ ఎథిక్స్ ఇన్ లీగల్ ప్రొఫెషన్' అన్న అంశంపైన ఆశానుద్దీన్ అమానుల్లా ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలో ఉన్న వారు నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఇక్కడ న్యాయమూర్తులు, న్యాయవాదులు వేరువేరు కాదని పేర్కొన్నారు. ఇద్దరి పాత్ర ఒక్కటేనని చెప్పారు. కక్షిదారుడికి న్యాయం చేయడమే ఇద్దరి లక్ష్యమన్నారు. ఈ వృత్తిలోనున్న వారు సామాజిక స్పృహతోపాటు నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఇది వరకు అనేక మంది రాజకీయ నాయకులుగానూ, ప్రజాప్రతినిధులుగానూ న్యాయవాదులుండేవారని పేర్కొన్నారు. ఇప్పుడు యువ న్యాయవాదులు కూడా నైతిక విలువలతో పనిచేయాలని సూచించారు. 'ఎఫెక్టివ్ కోర్టు రూమ్ అడ్వొకసి' అన్న అంశంపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రసంగించారు. న్యాయవాద వృత్తిలో రాణించాలంటే అధ్యయం ఎంతో అవసరమన్నారు. తద్వారానే నైపుణ్యతను సాధించగలరని చెప్పారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించుకుని కట్ అండ్ పేస్టే విధానాన్ని పాటించే పరిస్థితులు వస్తున్నాయని, అది సరైంది కాదని అన్నారు. నిరంతరం అధ్యయనం చేయడం ద్వారానే నైపుణ్యత పెరుగుతుందన్నారు. తద్వారా స్వతంత్రంగా పనిచేయగలుగుతారని చెప్పారు. పూర్వపు కేసుల్లో తీర్పులకు సంబంధించిన అంశాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తూ ఉండాల్సిన అవసరం ఉంటుందన్నారు. నిరంతరం అధ్యయనం ద్వారానే వృత్తి నైపుణ్యతను తద్వారా గౌరవాన్ని పొందగలరని సూచించారు. 'రూల్ ఆఫ్ లా అండ్ రోల్ ఆఫ్ అడ్వకేట్స్ ఇన్ బిల్డింగ్ ప్రాస్పరస్ భారత్' అన్న అంశంపై ఎస్‌విఎన్.భట్టి మాట్లాడారు. భారత నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశం సుసంపన్నంగా వర్ధిలాలి అంటే చట్టం అందరికీ సమాన్న భావన కలగాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి జస్టిస్ వి.దుర్గాప్రసాద్ రావు, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ కే.మన్మధరావు, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ శ్యామసుందర్, చెన్నై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ఛైర్మన్ అండ్ అడ్వకేట్ ఎస్.ప్రభాకరన్, ఎపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఘంటా రామారావు, కె.రామజగదీశ్వరరావు, అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాథరెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ఛైర్మన్‌ఎ.రామిరెడ్డి, సీనియర్ అడ్వొకేట్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ తరగతుల అనంతరం ముగ్గురు న్యాయమూర్తులకు బార్ కౌన్సిల్ అసోసియేషన్ సభ్యులు శాలువాలు కప్పి సత్కరించారు. జిల్లా కలెక్టరు గౌతమి వారికి జ్ఞాపికలను అందజేశారు.

లేపాక్షి ఆలయం సందర్శన

లేపాక్షి ఆలయాన్ని సందర్శిస్తున్న సుప్రీం కోర్టు జడ్జి అశానుద్దీన్ అమానుల్లా

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా పాపాన్నేశ్వర ఆలయం, లేపాక్షి చారిత్రాత్మక కట్టడాలను సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా జడ్జి గౌరవ జస్టిస్ అశానుద్దీన్ అమానుల్లా, జడ్జి వెంకట్ నారాయణ బట్టిలు శనివారం సందర్శించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను తెలియజేసారు. లేపాక్షి ఆలయం సందర్శించి శిల్పకళా నైపుణ్యాన్ని చూసి ముగ్దులయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ మాధవరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాలోని అదనపు సివిల్ జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డిఇఒ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం జిల్లా రెగ్యులర్ విద్యాశాఖ అధికారిగా వరలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు పరీక్షల విభాగం అసిస్టెంట్ కమీషనర్ గోవింద నాయక్, ఎడిఎ కృష్ణయ్య , సూపరింటెండెంట్లు శ్రీనాథ్, సిబ్బంది పార్ధసారథి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అందరి సహకారం, సమన్వయంతో జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేద్దామని డిఇఒ సూచించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ వరలక్ష్మి

మెట్టు.. కాపు.. మాటల యుద్ధం..!

వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమంలో విమర్శలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం అధికార వైసిపిలో అసమ్మతి జ్వాలలు చల్లారడం లేదు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, వైసిపి సమన్వయకర్తల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తాజాగా ఒకే వేదికపై ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. బొమ్మనహాల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శనివారం ఉదయం వైఎస్ఆర్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐకెపి రాయదుర్గం ఏవో గంగాధర అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై నాయకులు ఒక్కొక్కరు ప్రసంగించారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలన్న తపనతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలు దీనిని గుర్తించి ఆయన్ను రెండవ సారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాల సంగతి ఎలా ఉన్నా.. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మండలంలో వివిధ గ్రామాలకు రోడ్లు వేయించానని చెప్పారు. ప్రతి ఒక్కరికీ తనవంతు సాయం అందించానని చెప్పారు. తన ప్రాణం ఉన్నంత కాలం రాయదుర్గం నియోజకవర్గం ప్రజలతోనే ఉంటానన్నారు. 2024 ఎన్నికల అనంతరం ఇక్కడ గెలిచిన వారు స్థానికంగా ఉంటారు... ఓడిపోయిన వారు బెంగుళూరుకు వెళ్లిపోతారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కాపు వ్యాఖ్యలపై మెట్టు స్పందించారు. రాయదుర్గం ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని చూసి ఓటు వేశారే గానీ, ఇక్కడ పోటీ చేసిన వారిని చూసి కాదన్నారు. ఇలా సమావేశంలో ఇద్దరు నాయకుల మధ్య వాఖ్యానాలు పెరగడంతో పరిస్థితి కొంత గందరగోళంగా మారింది. ఈ నేపథ్యంలో సమావేశాన్ని త్వరితగతని అధికారులు ముగించేశారు. పోలీసులు ఇద్దరు నాయకులను వేర్వేరు ప్రాంతాల ద్వారా సభాప్రాంగణం నుంచి బయటకు పంపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పద్మ, వైసిపి మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపిపిలు రమేష్, ఇన్‌ఛార్జులు, ఎంపీడీవో విజయమ్మ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరగా కార్యక్రమం సభలో ఎడమొఖం,పెడమొఖంగా కూర్చొన్న కాపు రామచంద్రారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి

'ఉపాధి' అవినీతిపై చర్యలు తీసుకోండి

◆ ఈస్ట్ నర్సాపురంలో ఎమ్మెల్యే బంధువుల అవినీతి ◆ పూర్తి వివరాలతో వాస్తవాలు బయటపెట్టిన 'వ్యకాసం'

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఈస్టు నరసాపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను అడ్డుపెట్టుకుని అక్రమంగా డబ్బులను స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గ్రామంలో జరిగిన ఉపాధి హామీ అవినీతిపై వ్యకాసం పూర్తి వివరాలను బయటకు తీసిందని, స్థానిక ఎమ్మెల్యే బంధువులు నిధులను కాజేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నాడు శింగనమల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కృష్ణమూర్తి వెల్లడించారు. సోదనపల్లి గ్రామంలో వివిధ రోజుల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.66,178 బిల్లులను స్థానిక ఎమ్మెల్యే బంధువు, సింగల్ విండో అధ్యక్షుడు శ్రీరామరెడ్డి స్వాహా చేశారన్నారు. శ్రీరామిరెడ్డి ఉపాధి పనులు చేయకుండానే చేసినట్లు చూపి రూ.66,178 నిధులను స్వాహా చేశారన్నారు. స్వాహా చేసిన నిధులు శ్రీరామిరెడ్డి, ఆయన సతీమణి బొమ్మన ఓబులమ్మ అకౌంట్లలోకి వెళ్లాయన్నారు. 2019- 20 ఆర్థిక సంవత్సరంలో 75 రోజులు పని చేసినట్టు రూ.15,977, 2020-21 సంవత్సరంలో 91 రోజులు పని చేసినట్టు చూపించి రూ.21,553, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 51 రోజులు పని చేసినట్టు చూపించి 12,669, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 34 రోజులు తన సొంత పొలంలో సర్వే నెంబరు 263-8 ఒక ఎకరం, ఈస్ట్ నరసాపురంలో ఉన్న భూమిలో చీనీ చెట్లకు నీళ్ల పెట్టినట్లు చూపి రూ.8వేలు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 30 రోజులు పని చేసినట్టు రూ.7979 ఇలా గ్రామంలో వివిధ దశలో జరిగిన ఉపాధి పనుల్లో శ్రీరామరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా నిధులను తనతో పాటు తన భార్య ఖాతాల్లోకి జమ చేయించుకున్నారని చెప్పారు. ఇక ఇతరుల భూమిని తన భుమిగా చూపి హార్టికల్చర్ ప్లాంటేషన్ చేసినట్లు తప్పుడు పత్రాల ద్వారా డ్రై లాండ్ హార్టికల్చర్ ద్వారా రూ.6,68,234 లబ్ధి పొందారన్నారు. శ్రీరామిరెడ్డి రాజకీయ నాయకుడిగా చలామని అవుతూ కూలీలకు రావాల్సిన ఉపాధి డబ్బులను అడ్డదారిన దోచుకోవడం చూస్తుంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇంత పెద్దఎత్తున జరిగిన అవినీతి నాలుగు సార్లు జరిగిన సామాజిక తనిఖీలు కనిపించకపోవడం చూస్తుంటే కొందరు అధికారులపైనా అనుమనాలు వ్యక్తం చేయాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా బొమ్మను శ్రీరామిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు ఉపాధిని అడ్డుపెట్టుకుని వారి ఖాతాల్లో జమ చేసుకుని రూ.66,178 నిధులు, తప్పుడు పత్రాల ద్వారా డ్రై లాండ్ హార్టికల్చర్ లబ్ధి పొందిన రూ.6,68,234 నిధులను ఉన్నతాధికారులు రికవరీ చేయించాలని డిమాండ్ చేశారు. ఉపాధి అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలను వ్యవసాయ కార్మిక సంఘం అందజేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి, జిల్లా నాయకులు నాగ లింగయ్య, మండల కార్యదర్శి ఎర్రిస్వామి, శ్రీనివాసులు, పుల్లన్న, గిరి, సూర్య పాల్గొన్నారు.

ఉపాధి అవినీతికి సంబంధించి కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యకాసం నాయకులు

'అనంత' బాలోత్సవాన్ని జయప్రదం చేద్దాం

డిఇఓ వరలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పిల్లల పండుగ అనంత బాలోత్సవం-2024ను జయప్రదం చేద్దామని జిల్లా విద్యాశాఖ అధికారిణి వరలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం అనంత బాలోత్సవం కమిటీ సభ్యులు డిఇఒను కలిసి బాలోత్సవ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అనంత బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల పండుగకు ప్రత్యేకత ఉందన్నారు. ఈనెల 12, 13, 14వ తేదీల్లో ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహిస్తున్న బాలోత్సవాలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నట్లు తెలిపారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి బాలోత్సవం దోహదపడుతుందన్నారు. సెల్‌ఫోన్‌లు, వీడియో గేమ్స్ వంటి వాటికే బాల్యం పరిమితమవుతున్న తరుణంలో పిల్లల పండుగను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ పిల్లల తెలివి తేటలు, సృజనాత్మకతను వెలికి తీయడానికి బాలోత్సవం చక్కటి వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సావిత్రి, కమిటీ కోశాధికారి జిలాన్, సభ్యులు లింగమయ్య, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, రమణయ్య, రామాంజనమ్మ, ప్రజ్ఞ సురేష్, ఎల్లార్ వెంకటరమణ, వీరుపాక్షి, ఈరన్న చిలుకూరి దీవెన, రోహిణి, యామిని, పురంధరుడు పాల్గొన్నారు.

డిఇఓ వరలక్ష్మికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు

విజయవంతానికి ముందస్తు ప్రణాళికలు

అనంత బాలోత్సవం-2024 అకడమిక్ విభాగం పోటీల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు అనంత బాలోత్సవం అకడమిక్ విభాగం న్యాయ నిర్ణేతలు తెలిపారు. శనివారం జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో అకడమిక్ విభాగం కన్వీనర్ ఎస్‌వివి.రమణయ్య అధ్యక్షతన అనంత బాలోత్సవం అకడమిక్ విభాగం న్యాయ నిర్ణేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.సావిత్రి, కోశాధికారి జిలాన్ హాజరై అకడమిక్ విభాగం సంబంధించి పద్యరచన, వక్తృత్వం, పద్యం, భావం, మ్యాప్, క్విజ్, మట్టితో బొమ్మలు, కథా రచన వంటి 36 అంశాలపై న్యాయ నిర్ణేతలను నియమించారు. అనంతరం ఏఏ అంశాలపై చర్చించాలి, ఏ సమయానికి హాజరు కావాలి, వారికి కావాల్సిన మేటిరియల్ వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం అకడమిక్ విభాగం న్యాయనిర్ణేతలు లింగమయ్య, కోటేశ్వరప్ప, గోవిందరాజులు, సురేష్, నాగేంద్ర, లక్ష్మినారాయణ, గోవిందరెడ్డి, నరేంద్ర, దేవేంద్రమ్మ, రోహిణి, పారిజాత కుమారి, నబీరసూల్, లక్ష్మిదేవి, మధురశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 6,100 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు అతి తక్కువ పోస్టులు ప్రకటించారన్నారు. ముఖ్యంగా వ్యాయమ ఉపాధ్యాయులకు స్థానం కల్పించలేదన్నారు. ఈ విషయాన్ని పలుసార్లు ప్రభుత్వం దృష్టికి కూడా తెచ్చామన్నారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యాయమ ఉపాధ్యాయ నిరుద్యోగులు రాష్ట్రంలో 80వేల మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఉద్యోగాలు కల్పిస్తే పాఠశాలల్లో ఎంతో మంది క్రీడాకారులుగా తయారయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పీఈటీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీల పోరాటం చారిత్రాత్మకం

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

న్యాయమైన హక్కుల సాధన కోసం అంగన్‌వాడీ కార్మికులు చేపట్టిన 42 రోజుల నిరవధిక సమ్మె, దీక్షల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. శనివారం గణేనాయక్ భవన్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు జిల్లాస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో 42 రోజుల పాటు మహిళా కార్మికులు చేపట్టిన చరిత్ర లేదన్నారు. అంగన్‌వాడీలు పోరాడి చరిత్ర లిఖించారని తెలిపారు. చేసిన పోరాటం వృథా కాకుండా ప్రభుత్వాలు దిగొచ్చి 4 జిఓలు జారీ చేశాయంటే కార్మికుల విజయంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలు వేతనాలు పెంపుదల చేయాలని సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తొలి రోజు నుంచి వేతనాలు పెంచే ప్రసక్తే లేదంటూ అనేక ఆంక్షలు విధించిందన్నారు. ఎస్మా, సోకాజ్ నోటీసులు, అంగన్‌వాడీ కేంద్రాలు బలవంతంగా ప్రారంభించడం, వంటి బెదిరింపులకు పాల్పడిందన్నారు. అంగన్‌వాడీలు ఏమాత్రం జంకకుండా పోరాటాన్ని కొనసాగించారన్నారు. ఒక్కొక్క చర్చల్లో ఒక్కొక్క హామీకి ప్రభుత్వం దిగొచిందన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి అన్ని వర్గాల మద్ధతు సమాజ పోరాటంగా నిలవడంతో ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. వయోపరిమితి 62 సంవత్సరాలు, సూపర్‌వైజర్‌లకు 50 ఏళ్ల పొడగింపు, మినీవర్కర్లు, మెయిన్ వర్కర్లకు పదోన్నతి, మెయిన్ సెంటర్లుగా మార్పు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వర్కర్లకు రూ.1.20 లక్షలు, హెల్పర్‌కు రూ.40 వేలు పెంపుదల వంటి జిఓలను ఏకకాలంలో ప్రభుత్వం జారీ చేసిందన్నారు. వేతనాలు కూడా జూలై మాసంలో పెపుందల చేస్తామని మినిట్స్‌లో పొందు పరిచిందన్నారు. ఇన్ని డిమాండ్‌లను సాధించుకున్న అంగన్‌వాడీల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంగన్‌వాడీల పోరాటాలకు వెన్నుదన్నుగా నిలిచిన సిఐటియు నాయకత్వానికి, మద్ధతిచ్చిన వామపక్ష పార్టీలు, ఇతర రాజకీయ ప్రధాన పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులకు కృతజ్ఞతలు తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేసిన పోరాటానికి కార్మిక వర్గానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా మహిళా శక్తి ఏంటో చూపించారని తెలిపారు. కార్మికుల పక్షాన సిఐటియు ఎల్లవేళలా పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి జమున, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి
www.prajasakti.com

లివ్ ఇన్ ఎ హెల్తీ స్పేస్ పోటీలో 'శ్రీచైతన్య' ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య పాఠశాల ఏజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అమెరికాకు చెందిన నాసా నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్‌ఎస్‌ఎస్) వారు ప్రపంచవ్యాప్తంగా స్పేస్ సెటిల్‌మెంట్ అగ్రికల్చర్ మాడ్యూల్ డిజైన్‌పై మొదటిసారిగా నిర్వహించిన 'లివ్ ఇన్ ఎ హెల్తీ స్పేస్' డిజైన్ కంపిటేషన్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచినట్లు విద్యాసంస్థల అనంతపురం జోన్ ఏజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జోన్‌కు చెందిన తాడిపత్రి బ్రాంచి నుంచి 6వ తరగతికి చెందిన భావేష్, గుంతకల్-1 బ్రాంచి నుంచి 9వ తరగతి కి చెందిన మల్లేశ్వరి, మోహిదీయ, యశ్వంత్, శ్రీ సుమిత్, 8వ తరగతికి చెందిన శ్రావ్య ఘనవిజయం సాధించారని తెలిపారు. తాడిపత్రి బ్రాంచికి చెందిన ఆర్బిట్ గ్రో అనే ప్రాజెక్టు, గుంతకల్లు బ్రాంచ్ నుంచి అగ్రి ఒపులెన్స్ అనే ప్రాజెక్టు విద్యార్థులను ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కృషి, పట్టుదల ఉండటంతో పాటు ఉపాధ్యాయుల అత్యుత్తమ శిక్షణతో ఇలాంటి ఘన విజయం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్లు విశ్వనాథ్, వీరేష్‌బాబు, బాబు కోఆర్డినేటర్లు రాధాకృష్ణనాయుడు, తిరుమలేష్, శ్రీనివాసులు, నాగభూషణం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి అరాచకాలపై లోకేష్ 'శంఖారావం'

టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు

ప్రజాశక్తి-నార్పల

సీఎం జగన్, వైసిపి నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నినాదమే శంఖారావం అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు అన్నారు. శనివారం మండల పరిధిలోని బొందలవాడలో ఉన్న స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్ర చేయని ప్రాంతాల్లో నారా లోకేష్ శంఖారావం పేరుతో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులను వివరించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు 'శంఖారావం' అనే కీలక ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో 40-50 రోజుల్లో 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నారా లోకేష్ పర్యటించనున్నట్లు తెలిపారు. ఒక్కరోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం ఉంటుందన్నారు. శంఖారావం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తామన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా నారా లోకేష్‌తో తమ అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

గ్యాస్ వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలి

సహస్ర భారత్ గ్యాస్ ఏజెంట్ ఎస్.మంజుల

గ్యాస్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న గ్యాస్ సిబ్బంది

ప్రజాశక్తి-కుందుర్పి

గ్యాస్ వినియోగదారులు సిలిండర్ వినియోగంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సహస్ర భారత్ గ్యాస్ ఏజెంట్ ఎస్.మంజుల తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గ్యాస్ వినియోగంపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లో గాలి, వెలుతురు ఉన్న చోట మాత్రమే గ్యాస్‌ను వినియోగించాలన్నారు. అంతేకాకుండా గ్యాస్ ఉన్న చోట ఇతర పొయ్యిలను పెట్టకూడదన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి గ్యాస్ పైప్ మార్చాలన్నారు. సిలిండర్ దింపుకున్నప్పుడు చెక్ చేసుకుని తీసుకోవాలన్నారు. స్టవ్, రెగ్యులేటర్ ఎలా ఉందో గ్యాస్ ఆఫీస్ మెకానిక్‌తో తరచూ చెక్ చేయించుకోవాలన్నారు. రాత్రివేళల్లో రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలన్నారు. ఒకవేళ గ్యాస్ లీక్ అయితే ఎలాంటి కరెంట్ స్విచ్లు వేయరాదన్నారు. తలుపులు కిటికీలను తెరచాలన్నారు.

వైసిపి నేతలపై అసత్య ఆరోపణలు తగవు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి నాయకులపై విప్ కాపు రామచంద్రారెడ్డి అసత్య ఆరోపణలు చేయడం తగదని వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ఉషారాణి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఉపేంద్రరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామచంద్రారెడ్డి తమపై ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా పోస్టు చేశారన్నారు. వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించి బెంగళూరుకు పంపి తాము ఇక్కడ పార్టీ ఇన్‌ఛార్జి బాధితులు తీసుకోవాలని ఉద్దేశంతో పని చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ఆరోపణ చేయడం బాధాకరమన్నారు. కాపు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు, వైసిపిలో చేరాక ఆయన గెలుపు కోసం చిత్తశుద్ధితో కృషి చేశామన్నారు. ఇప్పుడు టికెట్ రానంతమాత్రాన సీఎం జగన్, మెట్టు గోవిందరెడ్డి, తమపైన అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కాపు ఓటమిపాలై ఏడాదికి పైగా రాయదుర్గం వదిలి బళ్లారిలో ఉండ లేదా అని గుర్తు చేశారు. ఇకనైనా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ ఆరవ శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజ్ఞ వికాస పరీక్ష విజయవంతం : ఎస్‌ఎఫ్‌ఐ

అనంతపురంలో ప్రజ్ఞ ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని ఎస్‌వి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రజ్ఞ వికాస పరీక్ష విజయవంతమైనట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ తెలిపారు. ముందుగా కళాశాల కరస్పాండెంట్ భాజావలితో కలిసి ప్రశ్న పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రశ్నపత్రాన్ని ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు తయారు చేసినట్లు తెలిపారు. పబ్లిక్ పరీక్షలు అంటే భయం వీడాలనే ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా పదో తరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాలు ఎదురుకునేందుకు సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి.దస్తగిరి, కె.మల్లికార్జునరావు, ఎ.వలీబాషా, ఎం.యోనయ్య, ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి శివ, ఉపాధ్యక్షులు సోము, నాయకులు భీమా, మారేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ కరిబసవేశ్వర ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష విజయవంతంగా ముగిసింది. ముందుగా ప్రశ్నపత్రాలను యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామప్పచౌదరి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ, జిల్లా కమిటీ సభ్యులు, మారుతి, యుటిఎఫ్ నాయకులు, రఘు రాజశేఖర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు అంటే విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రజ్ఞ వికాసం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త కె.ఎస్ లక్ష్మణరావు తయారు చేస్తారన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల స్థాయిలో మొదటి మూడు బహుమతులు, జిల్లాస్థాయిలో టాప్ 10 ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యాసంస్థల అధినేత సుబ్బారెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శి హిరణ్య, నందు, నాయకులు గురుమూర్తి, మనోజ్, దేవకుమార్, యుటిఎఫ్ నాయకులు సంజీవ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల దుకాణం సీజ్ దుర్మార్గం : సిపిఎం

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని కింద పెట్రోల్ బంకు పక్కన ఉన్న ఇండియన్ స్టోర్ దుస్తుల దుకాణాన్ని మున్సిపల్ అధికారులు శనివారం ఉన్నఫళంగా సీజ్ చేయడం దుర్మార్గమని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ స్టోర్ దుస్తుల దుకాణాన్ని ఆరు నెలల క్రితం ప్రారంభించారన్నారు. అంతకుముందే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుని రూ.లక్షలు వెచ్చించి షెడ్ నిర్మించుకున్నా రన్నారు. వ్యాపారం ప్రారంభించి ప్రజలందరికీ తక్కువ ధరలో మంచి నాణ్యమైన దుస్తులను అందుబాటులో ఉంచారన్నారు. అయితే మున్సిపల్ అధికారులకు ఆరునెలలుగా కనబడలేని పర్మిషన్ హడావుడిగా శనివారం వచ్చి అనుమతులు లేవని సీజ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. పట్టణంలో కొన్ని షాపులకు పర్మిషన్ లేకుండానే నడుపుతున్నారని, మరి వాటి మీద లేని చర్యలు ఇండియన్ స్టోర్ షాప్ చేయడం సిగ్గుచేటన్నారు. ఇండియన్ స్టోర్ దుకాణ యజమానులు తగ్గువ ధరకు దుస్తులు అముతుండటంతో ఓర్వలేక పట్టణంలోని దుస్తుల షాపుల యాజమాన్యం వారు కొంతమంది పోగై వారించారన్నారు. తమిళనాడు నుంచి వచ్చి వ్యాపారం చేయకూడదని బెదిరించడం బాధాకరమన్నారు. స్థానిక వ్యాపారులు చొరవతో దుకాణం సీజ్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సీజ్ చేసిన ఇండియన్ స్టోర్‌షాపును తక్షణమే ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాదుడు ప్రభుత్వాన్ని సాగనంపుదాం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

కూలీలతో మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వివిధ రకాలు పన్నులు, ఛార్జీల బాదుడుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయమే మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలను అడిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో కలిసి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు లేకపోవడంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి కరవైందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. మరోవైపు ప్రజల నెత్తిపై అనేక ఛార్జీల పెంపు, అధిక ధరలు, పన్నులు పెంపు బాదుడుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ సమయంలో టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం 'బాబు షూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ' కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కాదలూరులో 'ఇంటింటికీ మెట్టు'

మహిళకు నమస్కరిస్తున్న విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల పరిధిలోని కాదలూరు, బాదనహాళ్ గ్రామాల్లో సర్పంచి హనుమంతురెడ్డి, మండల కన్వీనర్ హొన్నూరుస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ మెట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, తనయుడు విశ్వనాథరెడ్డి హాజరై ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ పార్టీలు, కులాలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందనానరు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సిఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రహంతుల్లా, సింగాడి మంజునాథ, గొల్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎఐవైఎఫ్ నాయకులకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

ఎఐవైఎఫ్ నాయకులకు నోటీసులు

రాయదుర్గం : నేడు సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడంతో ఎఐవైఎఫ్ నాయకులకు రాయదుర్గంలో పోలీసులు నోటీసులు అందజేశారు. 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి 11న సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్, దినకర్, తేజ, యోగేంద్ర, తదితరులకు పోలీసులు శనివారం నోటీసులు అందజేశారు.

ఎన్ని 'కల' బడ్జెట్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి ఐదేళ్ల పాలన ముగియనుంది. ఐదు బడ్జెట్ తరహాలోనే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ తీరని నిరాశనే మిగిలింది. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని వైసిపి పాలకులు చెబుతున్నట్టుగానే సంక్షేమానికి కొంత కేటాయించినప్పటికీ అభివృద్ధి పనులు పూర్తిగ కుంటుపడ్డాయన్న విమర్శలూ ఉన్నాయి. ఈ వారంలో వైసిపి ఆఖరు బడ్జెట్‌నూ ప్రవేశపెట్టింది. దీనిపైనా విపక్షాలు దుయ్యబట్టారు. ఈ ఐదేళ్ల కాలంలో ఏం అభివృద్ధి చేసారో చూపించాలని అడుగుతున్నారు. ప్రధాన ప్రాజెక్టులేవి ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇందులో ప్రధానంగా హంద్రీనీవా ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రవాహ సామర్థ్యాన్ని 6వేల క్యూసెక్కులకు మొదటి దశలో పెంచి మరో 6వేల క్యూసెక్కులతో సమాంతర కాలువను తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో వైసిపి నాయకులు ప్రకటించారు. చేపట్టకపోవడం ఎలాగున్నా గతంలో జరుగుతున్న పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. కనీసం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ కూడా నోచుకోలేదు. అవకాశమున్న నీటిని తుంగభద్ర డ్యామ్‌కు తీసుకోలేని దుస్థితి ఏర్పడుతోంది. కనీసం మరమ్మతులు కూడా ఈ ఐదేళ్లలో చేయలేదన్న విమర్శలున్నాయి. ఇక పరిశ్రమల సంగతి వేరే చెప్పక్కర్లేదు. ఏ ఒక్క పరిశ్రమ చెప్పుకోదగినది రాలేదు. ఈ ఐదు బడ్జెట్‌లోనూ ఇదే కనిపించడంతో నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లా పరిస్థితి మరింత దయనీయంగానే మారింది. ఎప్పటి లాగానే ఉపాధి కోసం వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎక్కడైనా ఉపాధి పనులు జరిగినా వాటిని నేతలే దిగమింగిన దాఖలలు కనిపిస్తున్నాయి. ఇవి సోషియల్ ఆడిట్‌లోనూ అనేకం వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సిపిఎం సమగ్రాభివృద్ధి అంశాన్ని ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఇది గత నవంబరు మాసం నుంచే చేస్తున్నప్పటికీ ఈ వారంలో పుస్తకరూపంలో జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాలను కూడా ఇందులో పేర్కొంది. దీని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎన్నికల సమయంలోనైనా రాజకీయపార్టీలు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించే విధంగా ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. ఈ పుస్తకాన్ని రూపొందించడమే కాకుండా పలు ప్రజా సంఘాల నాయకులతోనూ ఆవిష్కరింపజేసింది. రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి ప్రజా ప్రతినిధులు ఆయా ప్రాంతాల్లో చేసే అభివృద్ధిపై ప్రశ్నించే విధంగా ప్రచారా కార్యమ్రాన్ని చేపట్టాలని చూస్తోంది. వాస్తవానికి ఇదే చర్చ జరగాలని పలువురు మేథావులు కోరుతున్నారు. ఎన్నికలు, రాజకీయాలంటే ఇప్పుడు అసలు సమస్యలకంటే వ్యక్తిగత దూషణలు, ఆరోపణలపైనే ఎక్కువగా ఉంటున్నాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలా కాకుండా ప్రజా సమస్యలు ఎన్నికల ప్రచారంలో చర్చకు రావాలని కోరుకుంటున్నారు. దీనికి ఇప్పుడు పోటీ చేయబోయే నేతలు ఎటు పరిష్కారాలను చూపుతారన్న హామీలను రాబట్టే ప్రయత్నం చేయాల్సిన అవసరముంది. పాతవారే తిరిగి పోటీచేసే విధంగా అయితే గతంలో ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తుచేసి, వాటి కోసం ఏం చేసారన్నది ప్రశ్నించాల్సి ఉంటుంది. ఇంకోవైపు ఎన్నికలు సమీస్తుండటంతో టిక్కెట్లు వేడి ఆయా పార్టీల్లో పెరుగుతోంది. ప్రధానంగా టిడిపి, వైసిపిల్లో టిక్కెట్ల గోల మొదలైంది. ఏదో రకంగా టిక్కెట్టును దక్కించుకునే పనిలో నేతలు నిమగ్నమై ఉన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

ఉరవకొండ : మండల పరిధిలోని పెద్దకౌకుంట్ల, రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షితం మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యాధికారులు పివి.అనికేత్, పావని కలిసి దాదాపు 59 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. బిపి,షుగర్ మరియు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్లు రమణ, షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, నాగరత్న, భగవాన్‌దాస్, స్టాఫ్‌నర్సులు జినతున్నీసా, హిమబిందు, భారతి, సుమలత, భవానీ, ఎంఎల్‌హెచ్‌పిలు మౌనిక, దివ్యభారతి, ప్రియాంక, ఎఎన్‌ఎంలు నీలావతి, చాముండేశ్వరి, లలిత, పద్మావతి, పార్మాసిస్ట్ హరిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నేరాలు ఘోరాలు

భార్య, కుమార్తెను చంపిన వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన రామకృష్ణ

తాడిపత్రి రూరల్ : బెట్టింగ్‌లకు అలవాటు పడి ఆర్థికంగా కుంగిపోయి భార్యతో పాటు కుమార్తెను హత్య చేసిన నిందితుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల పరిధిలోని పెద్దపొలమడ గ్రామ సమీపంలో రైల్వేట్రాక్‌పై చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. యాడికి గ్రామంలో మగ్గం పని చేసుకునే రామకృష్ణకు ఐదేళ్ల కిందట యాడికికి చెందిన చంద్రావతితో వివాహమైంది. వీరికి ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. ఈనేపథ్యంలో జుదాలకు అలవాటు పడిన రామకృష్ణ డబ్బులు పోగొట్టుకున్న తరచూ భార్యతో గొడవపడేవాడు. గురువారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆమె పడుకున్న సమయంలో ముఖంపై దిండుతో అదిమి చంపాడు. తర్వాత తొమ్మిది నెలల చైత్రికపై బియ్యం బస్తా ఉంచి పరారయ్యాడు. పెద్ద కూతురు అమ్మమ్మ ఇంటో ఉంటూ చదువు కుంటుండడంతో ప్రాణాలతో బయట పడింది. మరుసటి రోజు ఉదయం రామకృష్ణ చరవాణికి సోదరుడు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో ఇంటికి వచ్చి చూశాడు. ఇంటికి తాళం వేసి ఉంది. స్థానికుల సహాయంతో ఇంట్లో వెళ్లి చూడగా ఇద్దరు మృతదేహాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యాడికి పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. కాగా శనివారం తాడిపత్రి మండలం పెద్ద పొలమడ వద్ద రైలు కింద పడి వ్యక్తి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులకు అందిన సమాచారంతో రైల్వే పోలీసులు వెళ్లి పరిశీలించగా మృతుడు యాడికికి చెందిన రామకృష్ణగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం రామకృష్ణ మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మద్యం వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం పోలీసులు శనివారం ఎరిడికెర పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఇద్దరిని అరెస్టు చేసి 288 కర్నాటక మద్యం పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా ఎరిడికెరకు చెందిన వీరదాసు, మళ్లేసి కర్నాటక రాష్ట్రం శిరివాళం గ్రామంలోని సూపర్ బార్, రెస్టారెంట్ నుంచి 288 కర్నాటక మద్యం పాకెట్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో జిల్లాలోకి తీసుకొస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇద్దరినీ అరెస్టు చేసి మద్యం పాకెట్లు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

ఎలక్ట్రికల్ స్కేళ్లపై ముద్ర తప్పనిసరి

స్కేళ్లకు ముద్రికలు వేస్తున్న అధికారులు

బెలుగుప్ప : మండలంలోని వ్యాపారులు కొలతలు, తూనికలకు ఉపయోగించే ఎలక్ట్రికల్ స్కేల్‌లు, కొలతలకు ఉపయోగించే పరికరాలకు సంవత్సరానికి ఒకసారి సరి చూసి ముద్రకలు తప్పని సరిగా వేయించుకోవాలని తూని కలు, కొలతల శాఖ అధికారి వై.జి.శంకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలోని ఎలక్ట్రికల్ స్కేళ్లకు ముద్రికలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వ్యాపారులకు వారంరోజుల కిందట ఎలక్ట్రికల్ స్కేళ్లు, కొలతల పరికరాలకు ముద్రకలు వేసుకోని వారిపై నోటీసులు అందజేయడంతోపాటు సర్వే చేసినట్లు తెలిపారు. ఎవరైనా వ్యాపారస్తులు ముద్రకలు వేయించుకోకపోతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్లు పటాన్, సమ్‌షేర్, ప్రకాష్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి బస్టాండ్‌లో సదుపాయాలు కల్పించాలి

గుత్తి : స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని బస్టాండులో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974లో ప్రారంభించిన ఈ బస్టాండ్ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జి. రామదాసు, నాయకులు రమేష్, రాజు, మధు, నరసింహయ్య,నజీర్, వెంకట రాముడు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గుంతకల్లు : పట్టణ పరిధిలోని కొనకొండ్ల రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎంబిఎ, ఎంసిఎ కళాశాలలోని సెమినార్ హాలులో సీనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్.మంజునాథ మాట్లాడుతూ పీజీ విద్యార్థులు దేశ భవిష్యత్తుకు బాటలు వేసే విధంగా స్ఫూర్తిదాయకమైన జీవితం గడపాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఓంకారప్ప, గురురాజ, ప్రిన్సిపల్ డాక్టర్.వై. హనుమాన్ ప్రసాద్, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

నార్పల : మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల ప్రహరీకి ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ నాయకులు పాఠశాల వద్దకు చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ పాఠశాలకు పక్కనే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నా విద్యుత్ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, సీనియర్ నాయకులు నాగరాజు, సుధాకర్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

12న సాధారణ సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సి.పెద్దన్న అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సుబ్బరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, వైద్యం, గృహ నిర్మాణాలు, తాగునీటి సమస్య, పారిశుధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకంతోపాటు వివిధ సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున సమావేశానికి జడ్పిటిసిలు ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.